సాక్షి
ప్రకాశం
సోమవారం ∣ 9 ∣ డిసెంబర్ ∣ 2024



బొమ్మాళీ..మేమే అమ్మాలి

మార్కాపురం నియోజకవర్గంలో అరాచకం రాజ్యమేలుతోంది. అధికార కూటమి నేతలు ఇసుక విక్రయాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని దందా సాగిస్తున్నారు. - 8లో..



కిరాణా దుకాణంలో దొంగతనం

జిల్లాలో ఆదివారం దొంగలు హల్‌చల్ చేశారు. పొదిలి విశ్వనాథపురంలో ఓ కిరాణాదుకాణంలో దొంగలు పడగా, పీసీపల్లిలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

నేటి నుంచి స్కూల్ లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం

ఒంగోలు సిటీ: జిల్లాలోని స్కూల్ లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాంనకు కేటాయించిన ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు సోమవారం నుంచి 6 రోజుల పాటు ఒంగోలులోని శ్రీరామచంద్రమిషన్‌లో జరిగే రెసిడెన్షియల్ శిక్షణకు హాజరు కావాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు కె.ఆర్.పి లు, డి.ఆర్.పి లు చీరాలలో జరిగే ఎఫ్.ఎల్.ఎన్ ట్రైనింగ్ కు విధులు కేటాయించిన ఉపాధ్యాయులు కూడా హాజరు కావాలని తెలిపారు. విధులు కేటాయించిన వారి వివరాలు ఇప్పటికే మెయిల్, వాట్సప్ ద్వారా పంపించినట్లు తెలిపారు. సంబంధిత ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు విధులు కేటాయించిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించారు. సోమవారం ఉదయం 7 గంటలకు సంబంధిత కేంద్రాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు జ్యోతి ప్రకాష్



ఒంగోలు: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఒంగోలు గోపాల్‌నగర్‌కు చెందిన దగ్గేలు జ్యోతి ప్రకాష్ అర్హత సాధించారు. ఇటీవల విజయవాడ శాతవాహన కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో జిల్లా నుంచి ఇతను ప్రాతినిధ్యం వహించాడు. కాంపౌండ్ రౌండ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించడంతో పాటు త్వరలో జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా జ్యోతి ప్రకాష్‌ను స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలోనూ మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి పి.లెమ్యూల్‌రాజు తదితరులు ఉన్నారు.

అగ్రిగోల్డ్ భూముల్లో పచ్చదొంగలు

సంపద సృష్టించే అక్రమ మార్గాలు ఎక్కడున్నా అక్కడ పచ్చదొంగలు ప్రత్యక్షమవుతున్నారు. కొందరు ఇసుక, మట్టిని కొల్లగొడుతుంటే మరికొందరు చెట్టూ చేమల్నీ వదలడం లేదు. అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన వంద ఎకరాలకు పైగా భూముల్లో సాగుచేసి వదిలేసిన జామాయిల్ తోటలు తెలుగు తమ్ముళ్లకు ఇప్పుడు కాసులు కురిపిస్తున్నాయి. దొంగచాటుగా కర్రను నరికి రాత్రివేళల్లో లారీల్లో అక్రమంగా తరలించేసి జేబులు నింపుకుంటున్నారు.

- అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్లు నరికి తరలింపు
- వంద టన్నుల కర్ర అక్రమంగా తరలింపు
- రూ.లక్షలు కొల్లగొడుతున్న తెలుగు తమ్ముళ్లు
- చోద్యం చూస్తున్న అధికారులు



సీఎస్‌పురం (పామూరు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ మార్గాల్లో అక్రమార్జనకు పాల్పడుతున్న టీడీపీ నాయకుల కన్ను సీఎస్‌పురం మండలంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ తోటలపై పడింది. కూలీలను ఏర్పాటు చేసి యథేచ్ఛగా జామాయిల్ కర్రలు కొట్టించి రాత్రి వేళ లారీల్లో తరలించి రూ.లక్షలు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. మండలంలోని కంభంపాడు గ్రామం నుంచి పెదరాజుపాలెం వెళ్లే మార్గంలో 210/4, 210/3, 210/2 తోపాటు పలు సర్వే నంబర్లలో సుమారు వంద ఎకరాలకు పైగా అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన పొలాల్లో జామాయిల్ ఎక్కువగా సాగులో ఉంది. అగ్రిగోల్డ్ సంస్థ గతంలో సీఎస్‌పురం, పామూరు, హనుమంతునిపాడు, కనిగిరి ప్రాంతాల్లో భూములు కొనుగోలుచేసి అందులో జామాయిల్ సాగుచేసింది. ఆ సంస్థ పలు వివాదాలతో మూతబడగా దానికి చెందిన భూములు కొన్ని కోర్టు పరిధిలో, కొన్ని ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఈసంస్థకు చెందిన జామాయిల్ తోటలు సీఎస్‌పురం మండలంలోని రాజుపాలెం, చింతపూడు ప్రాంతాల్లో, పామూరు మండలంలో రేణిమడుగు, గుమ్మనంపాడు, కంబాలదిన్నె, పడమటి కట్టకిందపల్లె, దూబగుంట్లతోపాటు హనుమంతునిపాడు మండలాల్లో అధికంగా ఉన్నాయి. జామాయిల్ కర్ర సాధారణంగా 5 నుంచి 6 సంవత్సరాలకు కొట్టివేతకు వస్తుంది. అయితే సంవత్సరాల తరబడి ఇక్కడి పొలాల్లోని జామాయిల్ కొట్టకపోవడంతో కర్రలు ఏపుగా పెరిగి బలంగా ఉండి తక్కువ ప్రాంతంలో కొట్టినా లారీ నిండేలా ఉన్నాయి. జామాయిల్ కర్రను ఫైర్‌ఉడ్, ప్లేఉడ్, కాగితపు తయారీ, భవన నిర్మాణంలో పోటీకర్రలుగా ఉపయోగిస్తుండటంతో ప్రస్తుతం దీనికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో దీనిపై తెలుగు తమ్ముళ్ల కన్ను పడింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇతర ప్రాంతాల నుంచి సైతం కూలీలను పిలిపించి రాత్రివేళల్లో జామాయిల్ కర్రను కొట్టిస్తున్నారు. జామాయిల్ కర్ర అక్రమంగా నరికివేతకు గురవుతున్నా టీడీపీ అధికారంలో ఉండటంతో అధికారులు ఆవైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు. గతంలో రాజుపాలేనికి చెందిన పలువురిపై జామాయిల్ కొట్టారని అక్రమ కేసులు పెట్టి వారిని వేధించినట్లు సమాచారం.



రాత్రివేళ అక్రమంగా జామాయిల్ కర్రలతో తరలుతున్న లారీలు



తరలించేందుకు నిల్వ ఉంచిన జామాయిల్ కర్రలు

జామాయిల్ టన్ను రూ.7 వేలు పైమాటే

ప్రస్తుతం మార్కెట్‌లో జామాయిల్‌కు మంచి గిరాకీ ఉంది. టన్ను జామాయిల్ ధర సుమారు రూ.7 వేల నుంచి రూ.7,500 దాకా ఉంది. ఒక్కో లారీకి సుమారు 20 టన్నుల దాకా జామాయిల్ లోడ్ చేయగా లారీ లోడ్ ధర రూ.1.40 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు ఉంది. ఖర్చులు పోను సుమారు లోడ్‌కు రూ.80 వేలకుపైగా మిగులుతుంది. ఇప్పటి వరకు దాదాపు వంద టన్నుల కర్రను కొట్టి అక్రమంగా తరలించేశారు.

బురదనూ లెక్కచేయని అక్రమార్కులు

ఫెంగల్ తుపాన్ కారణంగా ఇటీవల వర్షాలు కురిసి పొలాల్లో బురద, నీరు ఉన్నా అక్రమార్కులు వాటిని లెక్కచేయలేదు. రాత్రి వేళ నరికిన చెట్లను తరలించేందుకు లారీలను రోడ్డుపై ఉంచి జామాయిల్ కర్రలను ట్రాక్టర్లకు లోడ్‌చేసి అక్కడి నుంచి రోడ్డుమీదకు తరలించి లారీల్లో నింపి తీసుకుపోతున్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు

అగ్రిగోల్డ్ భూముల్లో ఎవరైనా జామాయిల్ కర్ర కొట్టి తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వీఆర్‌ఓను ఘటనా స్థలాలకు పంపి వివరాలు సేకరిస్తాం. జామాయిల్ కర్ర కొట్టే సమయంలో సమీపంలోని గ్రామస్తులు సైతం బాధ్యతగా వ్యవహరించి రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– డి.మంజునాథరెడ్డి, తహసీల్దార్, సీఎస్‌పురం

ప్రశాంతంగా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

ఒంగోలు సిటీ: జిల్లాలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు డీఈఓ అత్తోట కిరణ్ కుమార్ ఆదివారం తెలిపారు. పరీక్షకు మొత్తం 3370 మంది విద్యార్థులకు గాను 3184 మంది హాజరయ్యారన్నారు. ఒంగోలులోని 5 పరీక్ష కేంద్రాలు, మార్కాపురంలోని 7, కనిగిరి లో 3 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఉప విద్యాశాఖాధికారి, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు, మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షించినట్లు చెప్పారు.

జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షునిగా సోమినేని సురేష్



జిల్లా అధ్యక్షుడు సోమినేని సురేష్



ప్రధాన కార్యదర్శి ఆళ్ల రామమోహన్

ఒంగోలు: ప్రకాశం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా సోమినేని సురేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ఎస్‌పీకేఆర్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. రాష్ట్ర పరిశీలకునిగా ఎస్.మురళి, జిల్లా పరిశీలకులుగా డీఎల్ఎన్ రెడ్డి, అడ్వొకేట్ సీబీ మైఖేల్ వ్యవహరించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పరిశీలకులు ప్రకటించారు.

నూతన కార్యవర్గం:
చైర్మన్‌గా తోపూరు సుబ్బారావు, ప్యాట్రన్‌గా ఈదర సుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆళ్ల వెంకటేశ్వర్లు, అధ్యక్షునిగా సోమినేని సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఆళ్ల రామమోహన్, కోశాధికారిగా నెప్పల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షునిగా ఎం.వెంకటస్వామి, పి.రాజేష్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు, టి.వెంకట శేషయ్య, పి.బాలాజీ, సంయుక్త కార్యదర్శులుగా ఎ.వెంకటేశ్వర్లు, పి.మురళి, జి.సురేష్, ఎం.మోహన్‌రావు, ఎస్.కోటేశ్వరరావు తదితరులు ఎంపికయ్యారు.

చిన్నారులకు మెనో!

చిన్నారులు, బాలింతలు, గర్భిణులపై కూటమి సర్కార్ దొంగదెబ్బ తీసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే మెనూ చార్జీల్లో కోత విధించగా, బాలింతలు, గర్భిణులకు నెల నెలా ఇచ్చే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయడం లేదు. ఇక పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు చెల్లించకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అప్పులు చేసి మెనూ అమలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

- అంగన్‌వాడీల్లో చిన్నారుల మెనూ చార్జీల్లో కోత
- కూరగాయల కొనుగోలుకు విద్యార్థికి రూ.1.75
- గుట్టుచప్పుడు కాకుండా 50 పైసలు కోతపెట్టిన కూటమి సర్కార్
- నానాటికీ పెరుగుతున్న కూరగాయల ధరలు
- జిల్లాలో 2903 అంగన్‌వాడీల్లో సుమారు లక్ష మంది చిన్నారులు
- బాలింతలు, గర్భిణులకు అందని పౌష్టికాహారం
- గుడ్లు సైతం సరిగ్గా సరఫరా కాని వైనం
- సరుకులు రాకపోయినా యాప్‌లో నమోదు చేయాలని ఒత్తిడి

ఒంగోలు సిటీ: ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం ఇక అంగన్‌వాడీ కేంద్రాల వెంటపడింది. చిన్నారులకు బలమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు అవసరమైన నిధులిచ్చి మెనూ సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన ప్రభుత్వం మెనూ చార్జీల్లో కోతపెట్టింది. జిల్లాలో 16 ప్రాజెక్టుల పరిధిలో 2903 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు చిన్నారులు 65,108 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు ప్రీ స్కూల్ పిల్లలు 52,982 మంది ఉన్నారు. వీరితో పాటు 31,311 మంది గర్భిణులు, బాలింతలు లబ్ధి పొందుతున్నారు. వీరు కాకుండా ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు గిరిజన చిన్నారులు 6,774 మంది ఉన్నారు. మూడు సంవత్సరాల నుంచి ఆరేళ్లలోపు ప్రీ స్కూల్ గిరిజన పిల్లలు 4,512 మంది, 1490 మంది గిరిజన గర్భిణులు, 1404 మంది గిరిజన బాలింతలు లబ్ధి పొందుతున్నారు. వీరికి ప్రతినెలా పంపిణీ చేసే పౌష్టికాహారానికి కూటమి సర్కార్ తూట్లు పొడుస్తోంది. చిన్నారులకు సంబంధించి మెనూ ప్రకారం కూరగాయలు కొనే విషయంలో ఇచ్చే చార్జీలను దొంగచాటుగా తగ్గించేసింది. గత వైఎస్సార్ సీపీ సర్కార్ కూరగాయల నిమిత్తం ఒక్కో విద్యార్థికి రూ.1.75 చెల్లించేది. అలాగే ఇంధన గ్యాస్ 50 పైసలు, తాలింపు గింజలకు 25 పైసలు ఇచ్చేది. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక కూరగాయల కొనుగోలులో 50 పైసలు తగ్గించేసింది. ప్రస్తుతం ప్రభుత్వం రూ.1.25 మాత్రమే చెల్లిస్తోంది.

భారీగా పెరిగిన ధరలతో అంగన్‌వాడీల అవస్థలు:
బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు అష్టకష్టాలు పడుతున్నారు. అప్పులు తెచ్చిమరీ వండి పెడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం చార్జీలు తగ్గించేయడంతో వారు అవస్థ పడుతున్నారు.



సక్రమంగా అందని పౌష్టికాహారం...
బాలింతలు, గర్భిణులకు ఇవ్వాల్సిన పౌష్టికాహారాన్ని సైతం సకాలంలో ఇవ్వడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌష్టికాహారం కింద బెల్లం, ఖర్జూరం, చిక్కీలు, రాగిపిండి, అటుకులు, కోడిగుడ్లు ప్రతి నెలా ఇస్తారు. అయితే వాటిని సైతం సకాలంలో సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. ప్రతి నెలా మూడుసార్లు కోడి గుడ్లు ఇస్తారు. అలాగే మిగతావి ప్రతి నెలా మొదటి శుక్రవారం పంపిణీ చేస్తారు. ఫేస్ యాప్ చేసి సరుకులు పంపిణీ చేసేవారు. అయితే సరుకులు సకాలంలో రాకపోవడం బాలింతలు, గర్భిణులకు సక్రమంగా పంపిణీ కావడం లేదు. సరుకులు ఇచ్చినా ఇవ్వకపోయినా యాప్‌లో నమోదు చేయాలని అధికారులు అంగన్‌వాడీలను ఒత్తిడి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. యాప్‌లో నమోదు చేయకపోతే మెమోలు ఇస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా సరుకులు ఇవ్వకుండా యాప్‌లో నమోదుకు లబ్ధిదారులు అంగీకరించకపోవడంతో అంగన్‌వాడీలు అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో పౌష్టికాహారం అందేదని, ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉన్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. చివరగా నవంబర్ మొదటి వారంలో సరుకులు వచ్చాయి. ప్రస్తుతం కాంట్రాక్టర్ మారి కొత్తవారు వచ్చే వరకూ సరుకులు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది.

ఇవ్వాల్సిన మెనూ ఇలా...
సోమవారం: దోసకాయపప్పు, ఉడికించిన కోడిగుడ్డు, పాలు (100 మిలీ)
మంగళవారం: పులిహోర, టమాట పప్పు, కోడిగుడ్డు, పాలు
బుధవారం: ఆకుకూర పప్పు, కోడిగుడ్డు, పాలు
గురువారం: ఆకుకూర, కూరగాయలతో సాంబారు, కోడిగుడ్డు, పాలు
శుక్రవారం: బీర లేదా సొరకాయ పప్పు, మునగాకు లేదా పాలకూరతో కూర, కోడిగుడ్డు, పాలు
శనివారం: వెజిటబుల్ రైస్, ఆకుకూర కూర, కూరగాయలతో సాంబారు, కోడిగుడ్డు, పాలు

మా భూములు మాకు ఇప్పించండి..



జువ్విగుంట సచివాలయం వద్ద విచారణ చేపడుతున్న తహశీల్దార్ జ్వాల నరసింహారావు

- రెండో రోజుకు చేరిన రావిళ్లవారిపాలెం గ్రామస్తుల నిరసన
- దళితుల భూములు అక్రమంగా టీడీపీ నేత ఆన్‌లైన్ చేయించుకున్నాడని ఆందోళన

మద్దిపాడు: మండలంలోని రావిళ్లవారిపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు పాలెపు రాగమ్మతో పాటు పలువురు దళితులకు సంబంధించిన భూములను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పాలెపు రమణయ్య రెవెన్యూ అధికారుల సహకారంతో కాజేసిన విషయం పై గ్రామస్తులు జువ్విగుంట సచివాలయం వద్ద చేపట్టిన ధర్నా ఆదివారం రెండో రోజుకు చేరింది. భూ ఆక్రమణలపై ×సాక్షి×లో ప్రచురితమైన కథనానికి స్పందించిన స్థానిక తహశీల్దార్ జ్వాలా నరసింహారావు సచివాలయం వద్ద విచారణ చేపట్టారు. తనకు తెలియకుండా తన పేరుతో ఉన్న 0.43 సెంట్లు భూమిని పెద్ద కుమారుడైన పాలెపు రమణయ్య అతని కుమారుడు తిరుపతినాయుడు పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, తిరిగి నా భూమి నాకు ఇప్పించాలని, లేదంటే నిరసన కొనసాగిస్తానని తహశీల్దార్ ముందు పాలెపు రమణయ్య తల్లి రాగమ్మ భీష్మించింది. 90 ఏళ్ల అవసాన దశలో ఉన్న తనను పోషించకుండా ఉన్న 0.43 ఎకరాల భూమిని తనకు తెలియకుండా పెద్ద కుమారుడు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ఏమిటని రెవిన్యూ అధికారులను నిలదీసింది. తనకు ముగ్గురు కుమారులు ఉన్నారని.. తన భర్త 35 ఏళ్ల క్రితం మరణించాడని, తన పోషణార్థం తలా రెండు ఎకరాలు భూమి వదిలేయాలని రాగమ్మ కోరింది. అలాగే గ్రామానికి చెందిన దళితులు పులగం పెద కోటయ్య, సొలసా చెన్నమ్మ మరి కొంతమంది దళితులు తమ భూమిని తమకు తెలియకుండా పాలెపు రమణయ్య అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని, ఆ భూములు తిరిగి ఇప్పించాలని తహశీల్దార్ ను కోరారు. వృద్ధురాలు రాగమ్మ సమస్య గ్రామంలోని పెద్ద మనుషుల సమక్షంలో విచారణ చేపట్టి తగు న్యాయం చేస్తానని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు. దళిత భూముల ఆక్రమణలపై అర్జీ రూపంలో తెలియజేస్తే విచారణ చేపట్టి న్యాయం చేస్తానన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ వీఆర్‌ఓ శ్రీహరి, గ్రామపెద్దలు, బాధిత రైతులు ఉన్నారు.

ఒంగోలు రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

ఒంగోలు సిటీ: ఒంగోలు రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ (ఏపీజేఏసీ) రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆదేశాలతో ఎన్నిక నిర్వహించారు. జిల్లా ఏపీఆర్ఎస్ఏ నాయకులు పి.మధుసూదనరావు, ఆర్.వాసుదేవరావు, ఎన్వీబీ రాజేష్, శ్రీనివాసరావు ఇతర సభ్యుల అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో 12 మంది సభ్యులతో కూడిన ప్యానల్‌ను ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా జి.ఆంజనేయులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్.బ్రహ్మయ్య, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎండీ.షమీవుల్లా, కె.శివరామకృష్ణ, ఎం.గౌతమి, సెక్రటరీగా కె.సాయిపవన్, జాయింట్ సెక్రటరీలుగా పీవీ.రమణయ్య, కె.కోటిరెడ్డి, ఎస్.కొండయ్య, ట్రెజరర్‌గా డి.వెంకటేశ్వర్లు, ఈసీ మెంబరు 1 గా పి.ఉపేంద్రయాదవ్, ఈసీ మెంబరు 2 గా కె.జయకృష్ణ లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా వెంకటేశ్వరరావు, రామనారాయణరెడ్డి వ్యవహరించారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

- హాజరుకానున్న మాజీ మంత్రి కారుమూరి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూచేపల్లి



కేపీ నాగార్జునరెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల సమావేశాన్ని స్థానిక విఠా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లె శివప్రసాద్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

యర్రగొండపాలెంలో..
యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశం సోమవారం మధ్యాహ్నం 3గంటలకు జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని వైష్ణవి గార్డెన్స్‌లో నిర్వహిస్తారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా స్థాయి నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి



ప్రశంస పత్రం అందుకుంటున్న మోహన్

మార్కాపురం: తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిచేయాలని జాతీయ కవి, రచయిత, ప్రముఖ వ్యక్తిత్వ వికాసకులు జాలాది మోహన్ సూచించారు. ఆదివారం స్థానిక గోళ్ల సత్యనారాయణ కల్యాణ మండపంలో కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఆదరణ వెల్ఫేర్ సొసైటీ పదో వార్షికోత్సవం సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి జాలాది మోహన్ చేస్తున్న కృషికిగాను తెలుగు తేజం పురస్కారం 2024ను అందించి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ సి.నారాయణస్వామి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య, సూపర్‌స్టార్ కృష్ణ కళాపరిషత్ రాష్ట్ర కార్యదర్శి గన్నెపూడి యోబు, ఆదరణ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు గొట్టిముక్కల చెన్నకేశవులు, ధనాసి ఉషారాణి, అరెకటిక నాగేశ్వరరావు, ఐకోట రవికుమార్ తదితరులు జాలాది మోహన్ సేవలను కొనియాడారు.

క్లుప్తంగా

రూ.4 కోట్లు మోసం చేసిన కమీషన్ వ్యాపారిపై కేసు

యద్దనపూడి: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఓ కమీషన్ వ్యాపారి కొనుగోలు చేసి రైతులకు నగదు ఇవ్వకుండా ఉడాయించిన ఘటనపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. యద్దనపూడి ఎస్సై రత్నకుమారి తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన గోగుల నాగరాజు తాతపూడి వద్ద ఓ కోల్డ్ స్టోరేజీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కోల్డ్ స్టోరేజీకు వచ్చే రైతులతో మంచి పరిచయాలు పెంచుకొని ఎంతో నమ్మకంగా రైతుల నుంచి పంటను కొనుగోలు చేసేవాడు. ఇలా యద్దనపూడి, చిలకలూరిపేట, తాతపూడి, వీరన్నపాలెం, పూనూరు గ్రామాలకు చెందిన రైతుల నుంచి రూ.4 కోట్ల మేర శనగలు కొనుగోలు చేసి ఉడాయించాడు. యద్దనపూడి మండలంలోనే 9 మంది రైతుల వద్ద సుమారు రూ.1 కోటి మేర శనగలు కొనుగోలు చేసి పరారయ్యాడు. ఈ మేరకు యద్దనపూడి గ్రామానికి చెందిన గొట్టిపాటి వెంకట్రావు అనే వ్యక్తి తన వద్ద నుంచి 320 క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేసి రూ.21 లక్షలు ఇవ్వకుండా పరారయ్యాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో గోగుల నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రత్నకుమారి తెలిపారు.

ఇళ్ల మధ్యలో భారీ కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ నిరంజన్

మార్కాపురం రూరల్: ఇళ్ల మధ్యలో భారీ కొండచిలువ కలకలం సృష్టించిన సంఘటన మార్కాపురం మండలంలోని నికరంపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. సుమారు 15 అడుగుల పొడవు గల కొండచిలువ ఇళ్ల మధ్యలోని పశువుల పాకలో కనిపించింది. స్థానిక ప్రజలు భయంతో ఫారెస్టు సిబ్బందికి సమాచారం అందించారు. స్నేక్ క్యాచర్ నిరంజన్ అర్ధరాత్రి సమయంలో గ్రామానికి వచ్చి కొండచిలువను పట్టుకుని సమీపంలోని అడవిలో విడిచిపెట్టడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

సముద్రంలో పడి మత్స్యకారుడు మృతి

కొత్తపట్నం: సముద్రంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ బోటులో నుంచి నీటిలో పడి మునిగిపోయి మత్స్యకారుడు మృతిచెందిన సంఘటన కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామం వద్ద జరిగింది. మృతుడి కుమారుడు నాయుడు బాలకోటయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన నాయుడు రామలింగం (54) సముద్రంలో చేపల వేట సాగిస్తూ జీవిస్తుంటాడు. రోజువారీగా ఈ నెల 7వ తేదీ సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. చేపలు వేటాడుతూ వల లాగుతుండగా, ప్రమాదశావత్తూ నీటిలో పడిపోయాడు. అదే బోటులో చేపల వేటకు వెళ్లిన వల్లభుని మస్తాన్, వల్లభుని దుర్గాప్రసాద్, నాంచార్లు, వి.వంశీ కలిసి వలతో రామలింగంను నీటిలో నుంచి బయటకు తీసి ఒడ్డుకు తీసుకొచ్చారు. అయితే, అప్పటికే అతను మృతి చెందగా, పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్సై సుధాకర్‌బాబు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

బొమ్మాళీ.. మేమే అమ్మాలి!

- మార్కాపురం కూటమి నేతల గుప్పిట్లో ఇసుక వ్యాపారం
- నియోజకవర్గంలో సుమారు 30 చోట్ల డంపింగ్ కేంద్రాలు
- ఏ లారీ అయినా నేరుగా డంపింగ్ యార్డులకు రావాల్సిందే..
- నేరుగా వినియోగదారులకు అమ్మితే ఇక అంతే సంగతులు
- ఇసుక దందాపై పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్న మైనింగ్ అధికారులు



మార్కాపురం డంపులో నిల్వ ఉన్న ఇసుక

మార్కాపురం టౌన్: అధికారానికి అహంకారం తోడైతే అరాచకం పేట్రేగుతుంది. మార్కాపురం నియోజకవర్గంలో అరాచకమే రాజ్యమేలుతోంది. 'సంపద సృష్టి' యావలో పడిన అధికార కూటమి నాయకులు ఇసుక విక్రయాన్ని తమ గుప్పిట్లోకి తీసుకుని దందా సాగిస్తున్నారు. లారీలతో ఇసుకను నేరుగా విక్రయించేందుకు వీల్లేకుండా కట్టడి చేస్తూ.. ఫిక్స్‌డ్ రేట్లు నిర్ణయించి వినియోగదారులను దోపిడీ చేస్తున్నారు. రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చి రాశులుగా పోసుకుని టన్నుల లెక్కన విక్రయిస్తున్నారు. వ్యాపారులు లాభంలో కొంత తీసుకుని మిగిలిన నగదును ఏ రోజుకారోజు కూటమి నేతలకు అప్పగిస్తున్నారు. ఓ పద్ధతి ప్రకారం సాగుతున్న ఈ ఇసుక దందా సంగతి మైనింగ్ అధికారులకు తెలిసినా చేష్టలుడిగి చూస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి.

మార్కాపురం పట్టణానికి నెల్లూరు, కడప, తాడేపల్లి తదితర ప్రాంతాల నుంచి రోజూ సుమారు 30 వరకు ఇసుక లారీలు వస్తున్నాయి. ఒక్కో లారీలో సుమారు 40 టన్నుల ఇసుక తీసుకొస్తుంటారు. గతంలో ఇసుకను టన్నుల ప్రకారం లారీల యజమానులు అవసరమైన వారికి నేరుగా విక్రయించేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నేరుగా వినియోగదారులకు ఇసుక విక్రయించే పరిస్థితి లేకుండా కట్టడి చేశారు. రీచ్‌ల నుంచి తెచ్చిన ఇసుకను తమ దగ్గర డంప్ చేసి, వినియోగదారులకిచ్చే రేటు తీసుకుని వెళ్లిపోవాలని లారీల నిర్వాహకులను కూటమి నేతలు బెదిరించడం చర్చనీయాంశమైంది. మాట వినలేదంటే అనవసరమైన ఇబ్బందులకు గురవుతారని హెచ్చరిస్తుండటంతో లారీల ఓనర్లు చేసేదేమీ లేక ఇసుకను కూటమి నేతలకు అప్పగించి వెనుదిరుగుతున్నారు. లారీ యజమానులకు టన్నుకు 900 రూపాయలను డంప్‌ల నిర్వాహకులు ఇస్తున్నారు. అదే ఇసుకను వినియోగదారులకు రూ.1280 నుంచి రూ.1400కు విక్రయిస్తున్నారు. ఇందులో 100 రూపాయల లాభం ఉంచుకుని మిగిలిన సొమ్మును ఏరోజుకారోజు కూటమి నేతలకు అప్పగిస్తున్నారు. మార్కాపురం పట్టణంతోపాటు మార్కాపురం మండలం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో ఇసుక అధికారిక డంపులు లేకపోవడంతో కూటమి నేతలదే ఇష్టారాజ్యమైపోయింది.

ఉచితమంటే ఇదేనా?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇసుక అవసరమైన వారు యార్డుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి కొనుగోలు చేసేవారు. అయితే కూటమి అధికారంలోకి రాగానే గతంలో ఉన్న పారదర్శకమైన ఇసుక పాలసీని రద్దు చేశారు. ఇకపై ఇసుక ఉచితమని ప్రకటించి ప్రసార మాధ్యమాల్లో తెగ ఊదరగొట్టారు. ఇదంతా నిజమని భావించిన వినియోగదారులకు కూటమి ప్రభుత్వం గట్టిగానే షాక్ ఇచ్చింది. టన్ను ఇసుకను గతంలో లభించే ధర కంటే అధికంగా విక్రయించే పరిస్థితులు కల్పించింది. తద్వారా కూటమి నేతలు జేబులు నింపుకొనేలా సర్కారు వేసిన ఎత్తుగడలు చూసి వినియోగదారులకు దిమ్మెరపోతున్నారు.

అనధికార డంప్‌లపై చర్యలేవి?

మార్కాపురం పట్టణంతోపాటు నియోజకర్గంలో సుమారు 30 ప్రాంతాల్లో కూటమి నాయకులు అనధికార ఇసుక డంపులు ఏర్పాటు చేయించి విక్రయిస్తున్నారు. ఒక్క మార్కాపురం పట్టణంలోనే సుమారు 15 వరకు అనధికార ఇసుక డంపులు ఉన్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన మైనింగ్ శాఖ అధికారులు ఏమీ తెలియనట్టుగా నిద్ర నటిస్తున్నారు.



పట్టణంలో నిల్వ ఉంచి అక్రమంగా విక్రయిస్తున్న ఇసుక

ప్రైవేట్ డంపులపై చర్యలు తీసుకుంటాం

మార్కాపురం పట్టణంతో పాటు ఇతర పాంతాల్లో అనధికార ఇసుక డంపులుపై చర్యలు తీసుకుంటాం. లబ్ధిదారులు ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని వారికి కావాల్సిన ఇసుకను రీచ్‌ల నుంచి టన్నుకు రూ.250 చెల్లించి నేరుగా తెచ్చుకోవచ్చు. ప్రభుత్వం టన్ను ఇసుకకు రూ.1280గా నిర్ణయించింది. అనధికారికంగా ఇసుక వ్యాపారం నిర్వహిస్తే వాహనాలు సీజ్ చేస్తాం.

– విష్ణువర్ధన్, మైన్స్ ఏడీ

లారీలతో నేరుగా పార్టీలకు అమ్మకూడదంట



ఒకరు ఇసుక కావాలంటే నేను రీచ్ వద్దకు వెళ్లి నా లారీలో లోడ్ చేసుకుని మార్కాపురం వచ్చా. ఇక్కడికొచ్చాక బోడపాడు రోడ్డు జంక్షన్ వద్ద ఇసుక డంపు వద్దకు తీసుకెళ్లారు. ఇసుకను తాము చెప్పిన ధరకు ఇవ్వాలని లేదంటే అమ్మనీయమని జి.సురేంద్ర అనే వ్యక్తి తెగేసి చెప్పాడు. మీరు ఇస్తానంటున్న టన్ను ధర రూ.950కే పార్టీకి విక్రయిస్తానని చెప్పినా నా మాట వినలేదు. లారీ అప్పజెబితే టన్ను రూ.1250 ప్రకారం అమ్ముతాం, నీ రేటు నువ్వు తీసుకుని వెళ్లిపో అని బెదిరించారు. మరీ ఇంత అన్యాయమా?

– బాలాజి సింగ్, లారీ డ్రైవర్

కిరాణా దుకాణంలో దొంగతనం



పొదిలి దుకాణాల్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం



పెద్దఇర్లపాడులో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ ఖాజావలి, ఎస్సై కోటయ్య

- రూ.5 లక్షలు చోరీ

పొదిలి: పట్టణంలోని విశ్వనాథపురంలో గల కాలేజీ రోడ్డులో కిరాణా దుకాణంతో పాటు మరో పాన్ షాపులో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. బాధితుడు తటవర్తి బాలసుబ్రహ్మణ్యం ప్రకారం.. ఆదివారం ఉదయాన్నే కథనం ప్రకారం.. దుకాణం తెరిచేందుకు వెళ్లగా, షట్టర్ కొంత మేర ఎత్తి ఉంది. లోపల తనిఖీ చేయగా, రూ.5 లక్షల నగదు దొంగతనం జరిగిందని కోటి వాపోయాడు. చింతాల్ కూల్‌డ్రింక్ పాన్ షాపులో తాళాలు పగులగొట్టి రూ.3 వేలు దొంగిలించారని తెలిపారు. మరో కిరాణా దుకాణం తాళాలు కూడా పగులగొట్టే ప్రయత్నం జరిగినట్లు తెలిపారు. కోటి ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేమన తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒకే వ్యక్తి ఆటోలో వచ్చి దొంగతనం చేసినట్లు సీసీ కెమెరాల్లో నమోదైందని తెలిపారు.

పీసీ పల్లి మండలం పెద్దఇర్లపాడులో...

పీసీ పల్లి: మండల పరిధిలోని పెద్దఇర్లపాడులో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. గ్రామానికి చెందిన లింగాలదిన్నె నరసింహారెడ్డి కుటుంబం ఈ నెల రెండో తేదీ హైదరాబాద్ వెళ్లింది. ఆదివారం తిరిగి ఇంటికొచ్చి చూసుకోగా, సామగ్రి మొత్తం చిందరవందరగా పడి ఉంది. దొంగతనం జరిగిందని గ్రహించిన నరసింహారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రూ.15,000 విలువైన వెండి, తొమ్మిది సవర్ల బంగారం దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆదివారం సాయంత్రం దర్యాప్తు నిమిత్తం చోరీ జరిగిన ఇంటికి వెళ్లారు. దొంగతనం జరిగిన తీరును సీఐ ఖాజావలి, ఎస్ఐ కోటయ్య పరిశీలించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

కుమారుడిని హత్య చేశారంటూ తల్లి ఫిర్యాదు

కొత్తపట్నం:

తన కుమారుడిని ఎవరో హత్య చేశారని అనుమానంగా ఉందంటూ కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో రామలింగం సుశీల అనే మహిళ ఆదివారం ఫిర్యాదు చేసింది. ఆ వివరాల్లోకెళ్తే.. నెల్లూరు జిల్లా బోగోలు మండలం శిద్దన్నపేట గ్రామానికి చెందిన రామలింగం పిచ్చిరెడ్డి (34) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. 13 సంవత్సరాల క్రితం కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన విజయదుర్గను వివాహం చేసుకున్నాడు. మూడు నెలల పాటు సిద్దిపేటలో కాపురం ఉండి అనంతరం వజ్జిరెడ్డిపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నారు. విజయదుర్గ ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతూ ఉండేదని, ఎవరితో మాట్లాడుతున్నావంటూ పిచ్చిరెడ్డి అడగడంతో వారిద్దరూ అప్పుడప్పుడూ ఘర్షణ పడుతుండేవారని సుశీల తెలిపింది. ఈ విషయాన్ని తన అక్క జయలక్ష్మితో పిచ్చిరెడ్డి చెప్పాడంది. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీ పొలాల్లో పిచ్చిరెడ్డి పడి ఉండగా, హాస్పిటల్‌కు తరలించారని, డాక్టర్ పరీక్షించి చనిపోయాడని నిర్ధారించాడని చెప్పింది. అక్కడి నుంచి మృతుడ్ని నెల్లూరు జిల్లా శిద్దన్నపేట గ్రామానికి తీసుకెళ్లి పూడ్చిపెట్టినట్లు వివరించింది. తన కుమారుడిను అతని భార్య విజయదుర్గ, ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తి కలిసి చంపి ఉంటారని తనకు అనుమానంగా ఉందని కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తల్లి సుశీల ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్‌బాబు తెలిపారు.

డ్రోన్ కెమెరాతో సమర్థవంతంగా పోలీసు విధులు

- ఎస్పీ ఏఆర్ దామోదర్



డ్రోన్ కెమెరాను దర్శి సీఐ రామారావుకు అందజేస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: డ్రోన్ కెమెరాతో పోలీసు విధులు నిర్వహించడం మరింత సమర్థవంతంగా సాధ్యపడుతుందని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో దాత తానికొండ వెంకటరావు ఆర్థిక సహకారంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్‌ను ఎస్పీ దామోదర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ తన పనితీరును మెరుగుపరచుకోవడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం జరుగుతోందన్నారు. డ్రోన్ ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ, ఊరేగింపుల్లో అవాంఛనీయ సంఘటనలు నిలువరించుట, ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ముందస్తు చర్యలు, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదస్థలానికి వేగంగా చేరుకుని పరిస్థితిని అంచనా వేయడం చేయవచ్చన్నారు. వరదలు, భూకంపాలు వంటి విపత్తుల సమయంలో డ్రోన్‌లను ఉపయోగించి మిస్సింగ్ అయిన వ్యక్తులను వెతకడం, సహాయక చర్యలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తీరప్రాంత గస్తీ, హైవేలపై బైక్ రేస్‌లు అరికట్టుట, ఈవ్‌టీజింగ్ సర్వైలెన్స్, మాదకద్రవ్యాలు విక్రయించడం, సేవించడం, నాటుసారా తయారు చేయుట, పేకాట స్థావరాలు వంటి వాటిని కనుగొనుటకు ఉపయోగపడుతుందన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో మద్యపానం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాల ద్వారా పగలు, రాత్రి నిఘా ఉంచి వాటిని నియంత్రించడంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దర్శి సీఐ రామారావు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, దర్శి ఎస్సై మురళి, పీసీఆర్ ఎస్సై ప్రభాకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ సబ్ కమిటీ, రాష్ట్ర కౌన్సిలర్ల సంయుక్త సమావేశాన్ని జిల్లా శాఖ అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన అరియర్ బిల్లులు, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ మొదలుగువి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఉద్యమ రథసారథి నూతలపాటి పరమేశ్వరరావు సంస్మరణ సభను ప్రకాశం జిల్లా శాఖ విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం యాప్‌ల భారాన్ని తొలగించి బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, అరియర్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. క్లోజర్స్‌కు సంబంధించి తీవ్ర జాప్యం జరుగుతోందని, దాని నివారణకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, పూర్వ రాష్ట్ర కార్యదర్శులు రఘుబాబు, ఐ.విజయసారధి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్బారాయుడు, లేవి ప్రసాద్, శేషారావు, హనుమంతరావు, తిరుమల, నాయబ్‌రసూల్, మల్లికార్జునరావు, శేఖర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, యోహానురెడ్డి, రవి, నారాయణరెడ్డి, రాజకుమార్, కె.శ్రీనివాసరావు, టి.సుబ్బారావు, పి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన మహిళ

- మహిళ అకౌంట్ నుంచి రూ.4 లక్షలు స్వాహా

వేటపాలెం: సైబర్ నేరగాళ్లు మతిమీరిపోయారు. ఈ తరహా నేరాలు ఎక్కువవుతుండటంతో బాధితులు పెరిగిపోతున్నారు. గ్రామీణ మహిళ బ్యాంక్ అకౌంట్‌లో నుంచి రూ.4 లక్షల నగదు కాజేశారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వేటపాలెం ఎస్సై ఎం వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కఠారివారిపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన కాటంగారి అనిత గ్రామంలో చిన్న కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. నవంబరు 24వ తేదీన వేటపాలెంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో తనకు ఉన్న బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు డ్రా చేసుకోవడానికి వెళ్లింది. తన ఖాతాలో ఉండాల్సిన నగదులో రూ.4.05 లక్షలు ఆగస్టు 18 వ తేదీ నుంచి సెప్టెంబర్ 23వ తేదీ వరకు అనేక పర్యాయాలు ఇతర వ్యక్తులకు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ అయినట్లు బ్యాంకు సిబ్బంది మహిళకు తెలిపారు. దీంతో బాధిత మహిళ ఒక్కసారిగా కంగుతింది. తాను ఎవ్వరికీ నగదు పంపించలేదని నగదు ఎవరు తీసుకొన్నారని బాధిత మహిళ అనిత బ్యాంకు అధికారులను ప్రశ్నించింది. దీనిపై తమకు ఎటువంటి సమాచారం లేదని, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని బ్యాంకు సిబ్బంది మహిళకు సూచించారు. మహిళ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఇంత వరకు తనకు న్యాయం జరగలేదని వేటపాలెం పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తన అకౌంట్‌లో నగదు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్‌లు వచ్చినా అవి ఇంగ్లిషులో ఉండటంతో తాను తెలుసుకోలేకపోయానని బాధిత మహిళ తెలిపింది.

కార్లు ఢీకొని ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందు భాగం

పొదిలి రూరల్: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి పొదిలి మండలంలోని తలమళ్ల సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మర్రిచెట్లపాలెం నుంచి పొదిలి వైపు, కంభం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కార్లు మార్గమధ్యంలో తలమళ్ల వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండు కార్ల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో పీవీ రమణారెడ్డి తీవ్రంగా, జి.అంజిరెడ్డి, బాబు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో చీమకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

థియేటర్‌లో ఊడి పడిన స్పీకర్

- ప్రేక్షకుడికి తీవ్రగాయాలు

టంగుటూరు: కుటుంబంతో కలిసి పుష్ప–2 సినిమా చూస్తుండగా ప్రమాదవశాత్తు హాల్లో ఉన్న స్పీకర్ ఊడి పడటంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన టంగుటూరులోని వెంకటేశ్వర సినిమా హాల్లో ఆదివారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు టంగుటూరులోని ద్వారకా హోటల్ యజమాని వెంకట్రావు కుటుంబ సభ్యులతో కలిసి సినిమాకు వెళ్లారు. హాల్లో ఉన్న స్పీకర్ గోడతో సహా ఊడి తల మీద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను హుటాహుటిన టంగుటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేట్ వాహనంలో ఒంగోలులోని ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



బోల్తా పడిన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

కనిగిరి రూరల్: కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి కనిగిరి మండలం ఎన్.గొల్లపల్లి చెరువు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొండపి మండలం చవటపాలెం గ్రామానికి చెందిన తోపూడి కోటేశ్వరరావు(60) వెదురు కర్రలోడుతో సీఎస్ పురం మండలం ఉప్పలపాడు గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఎన్.గొల్లపల్లి సమీపంలో చెరువు మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో డ్రైవింగ్ సీట్‌లో ఉన్న తోపూడి కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్యాబిడ్డలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడు మృతి

పర్చూరు (చినగంజాం): సైకిల్‌పై వెళ్తున్న ఓ వృద్ధుడిని వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈఘటన పర్చూరులోని పిడుగురాళ్ల–వాడరేవు రోడ్డులో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పర్చూరుకు చెందిన తూమాటి సుబ్బయ్య (74) స్థానికంగా ఉన్న ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో సెక్యూరిటీగా పనిచేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం స్కూల్‌లో విధులు ముగించుకొని తన సైకిల్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి వస్తున్న టిప్పర్ అతనిని బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే తీవ్రగాయాలై మృతి చెందాడు. గతంలో లస్కర్‌గా పనిచేసి రిటైర్ అయిన సుబ్బయ్య ప్రస్తుతం వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుమారు నాలుగు నెలల క్రితం భార్య చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.